ప్రజాశక్తి
శుక్రవారం 26 డిసెంబర్ 2025
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి





అప్పలరాజుపై పీడీ యాక్ట్ రద్దు చేయాలి

◆ సిపిఎం నాయకులు కె.లోకనాథం, సిహెచ్.నర్సింగరావు డిమాండ్

◆ ప్రభుత్వ నిర్బంధంపై ఉమ్మడి విశాఖలో నిరసనలు



విశాఖలో చేపట్టిన నిరసన ర్యాలీలో లోకనాథం తదితరులు

అనకాపల్లి జిల్లాలో ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చే బల్క్ డ్రగ్ పార్కునకు వ్యతిరేకంగా పోరాడుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పిడి చట్టం పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లాలో గురువారం నిరసనలు వెల్లువెత్తాయి. గూండాలు, రౌడీషీటర్లు, ఆడ పిల్లలను అమానుషంగా కబళించే మానవ మృగాల మీద సైతం పెట్టని ఈ చట్టాన్ని అప్పలరాజుపై బనాయించడాన్ని వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎం ఆధ్వర్యాన విశాఖ జగదాంబ జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అప్పలరాజును తక్షణం భేషరతుగా విడుదల చేయాలన్నారు. ఆయనపై అక్రమ కేసుల బనాయింపు దారుణమన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు అప్పలరాజు ఇంటి దగ్గరకు పెద్ద సంఖ్యలో పోలీసులు వెళ్లి 'నీ మీద పిడి యాక్ట్ పెడుతున్నాం.. వెంటనే లొంగిపోవాలి' అని చెప్పి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చట్టానికి తాను భిన్నంగా వ్యవహరించలేదని, చట్టబద్ధంగానే ఉద్యమాలు నిర్వహించానని చెప్పినా పోలీసులు వినలేదన్నారు. ప్రధానంగా బల్క్ డ్రగ్ పార్కు వస్తే మత్స్యకారులు, కూలీల ఉపాధి పోవడమే కాకుండా ఈ ప్రాంత పర్యావరణం దెబ్బతింటుందని అప్పలరాజు కోరడమే ఆయన చేసిన తప్పా ? అని లోకనాథం ప్రశ్నించారు. పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ గంజాయి, ఎర్ర చం దనం స్మగ్లర్లు మీద, భూ తగదాల్లో తలదూర్చి వేలాది కోట్ల రూపాయలు సంపాదిస్తున్న వారిమీద, వైట్ కలర్ నేరాలు చేసే మిగతా 2లో..



చోడవరంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

వార్తలు 7లో..



విశాఖ నగరంలోని ఓ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఫిడే చెస్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: నగరంలోని ఎంవిపి ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2025 గురువారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీ చెస్ అకాడమీ, చైతన్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ పోటీలను ఆంధ్ర విశాఖ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. బాబూరావు, ఎస్3 స్పోర్ట్స్ ప్రతినిధి సహాని, చీఫ్ ఆర్బిటర్ జివి.కుమార్ జ్యోతి ప్రజ్వలనతో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీచెస్ అకాడమీ డైరెక్టర్ వి.శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ టోర్నీలో దేశంలోని16 రాష్ట్రాలతో పాటు ఐదు విదేశాల నుండి మొత్తం 582 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, వీరిలో 250 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. అనంతరం మొదటి ఆటను డాక్టర్ రంగాల మిగతా 2లో..

జోరుగా సిఐటియు మహాసభ ప్రచారం

▶ వార్త 8లో..

'మిడ్డే మీల్'ను ప్రయివేటీకరిస్తే ఉద్యమిస్తాం

▶ వార్త 7లో..

గోవాడ సుగర్స్ క్రషింగ్ ప్రారంభించాలి

▶ వార్త 6లో..



సాగర తీరం కళకళ

విశాఖ సాగర తీరం గురువారం జన రద్దీతో కిక్కిరిసింది. క్రిస్మస్ నేపథ్యంలో సెలవు దినం కావడంతో సాయంత్రం వేళ నగర వాసులు ప్రకృతి, సముద్రపు అందాలను వీక్షించేందుకు ఆర్‌కె బీచ్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. పార్కుల్లో సేదతీరారు. మరోవైపు ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ నెలకొంది.

ఆగని భూ వేట.. రుషికొండపై పాత పాటే !

◆ అంతిమంగా ఆతిథ్య రంగం వైపే మొగ్గు

◆ మంత్రుల కమిటీ ప్రాథమిక ఆమోదం

◆ ప్యాలెస్‌పై ఇంకొన్ని అంతస్తుల నిర్మాణం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకవైపు గత ప్రభుత్వం విశాఖ రుషికొండపై రూ.వందల కోట్లు వృథా చేసినట్టు 'కూటమి' ప్రభుత్వ పెద్దలు పాత పాట పాడుతూనే మరోవైపు అక్కడ ఖాళీగా ఉండే రూ.వందల కోట్ల భూమి కోసం వేట సాగిస్తున్నారు. దీన్ని కూడా వినియోగంలోకి తెచ్చేందుకు పావులు కదుపుతున్నారు. అలాగే ఇప్పుడున్న రుషికొండ భవనాలపై ఇంకొన్ని భవనాలు నిర్మించే యోచనలో పడ్డట్టు తెలుస్తోంది. మొత్తానికి ఏదైతేనేమీ కొత్తగా కాంట్రాక్టర్లకు రుషికొండ పని ఇవ్వబోతుందన్న చర్చ విశాఖలో నడుస్తోంది. జగన్ రుషికొండ విధ్వంసం చేశాడన్న ప్రచారాన్ని నాడు టిడిపి కూటమి తారా స్థాయికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. జగన్ విలాసాల పేలస్‌గానూ నాడు కూటమి నాయకులు దీన్ని పేర్కొన్నారు. తీరా అధికారం చేపట్టాక ప్రజో పయోగానికి వినియో గించకుండా మరలా ప్రభుత్వమే ప్రైవేట్ వాళ్ల చేతుల్లో పెట్టే దిశగా 'కూటమి' అడుగులు వేయడం కనిపిస్తోంది.



రుషికొండపై ఉన్న భవనాలు (ఫైల్ ఫొటో)

విశాఖ రుషికొండపై నిర్మాణమైన భవంతుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వ మంత్రుల కమిటీ భేటీ నిర్వహించి ప్రాథమికంగా అక్కడ ఆతిథ్య రంగం (హాస్పిటాలిటీ) కోసం కేటాయిస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి తాజాగా వచ్చినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి ఆదాయం రావాలంటే రుషికొండ భవనాల కిందగల 9 ఎకరాలనూ వినియోగించాలన్న నిర్ణయానికి కమిటీ వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న తాజా అడుగుల ప్రకారం 'అంతర్జాతీయ టూరిజం కేంద్రం'గా దీన్ని తీర్చిదిద్దాలనే యోచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. హాస్పిటాలిటీ రంగానికి దీన్ని కేటాయిస్తే ప్రజలు సందర్శించడం ద్వారా ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుందని 'కూటమి' ప్రభుత్వం భావిస్తోంది.

భూమి కోసం ప్రయత్నాలు

సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం రుషికొండ కింద ఉన్న 9 ఎకరాల్లో 7 ఎకరాలను నిర్మాణాలకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అప్పలరాజుపై పీడీ యాక్ట్ రద్దు చేయాలి

వాళ్ల మీద పెట్టాల్సిన పిడి చట్టాన్ని ప్రజా ఉద్యమాలు చేసే అప్పలరాజు మీద పెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని గొంతు చీల్చుకుని, గగ్గోలు పెట్టి, తీరా అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. బల్క్ డ్రగ్ పార్కు వల్ల మత్స్యకారుల ఉపాధి పోతుందన్నారు. ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. దీంతో అక్కడి ప్రజలు ఆందోళన చేస్తుంటే ఆ పరిశ్రమను నిషేధించాల్సింది పోయి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే నిర్బంధ చర్యలు ఆపాలని, లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.పద్మ, వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, ఆర్ఎస్ఎన్.మూర్తి, యుఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత జగదాంబ పరిసర ప్రాంతాల్లో నిరసన ర్యాలీ చేపట్టారు.

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులు అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ బృందావనం కాలనీలో నిరసన తెలిపారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు మైలపల్లి మహేష్ బాబు మాట్లాడారు. కళ్ల దేముడు, బొంది నూకమ్మ, కోర్లయమ్మ, జగదీష్ పాల్గొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చోడవరం కొత్తూరు జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. కె.కోటపాడు మండలం సూరెడ్డిపాలెం గ్రామంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. రాంబిల్లి మండల కేంద్రంలోనూ, కోటవురట్ల మండలం అణుకులోనూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడారు.

ఆగని భూ వేట.. రుషికొండపై పాత పాటే !

వినియోగించకూడదని, మిగిలిన 2 ఎకరాలనూ ఎలా వినియోగించాలో తాజాగా మంత్రుల కమిటీ తర్జనభర్జన చేస్తోంది. కొన్ని సంస్థలు ఇప్పటికే తమ ఆసక్తిని చూపినట్లు స్పష్టమవుతోంది. హాస్పిటాలిటీ రంగానికి కేటాయిస్తే దేశ, విదేశాలకు చెందిన బడా సంస్థలు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇదే ఆలోచిస్తున్న మాట నిజం. అదే సందర్భంలో రుషికొండ పేలస్ 'తెల్లఏనుగు'లా మారిందన్నది మంత్రుల సబ్ కమిటీ అధ్యక్షులు పయ్యావుల కేశవ్ ఈ సందర్భంగా చెబుతూ మరో మాటగా దీన్ని ఆదాయ వనరుగా మార్చే యత్నాలను ఈ నెలాఖరునాటికి సమగ్ర ప్రతిపాదనలతో ముందుకొస్తామనడం విశేషం. సిఆర్‌జెడ్ ఉల్లంఘనల గురించి మొత్తుకునే మంత్రుల కమిటీ ఏనాడైనా విశాఖలో సాగరతీరానికి అభిముఖంగా ఉండే నోవాటల్, సాయిప్రియ, ఎ 1 గ్రాండ్, రాడిషన్ బ్లూ ఒకటేమిటి చాలా హోటళ్లు సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించిన సంగతి చూశాయా ? అలాగే తాజ్ హోటల్‌ను తీసుకున్న నోవాటల్ యాజమాన్యం ఆ స్థలంలో పూర్తిగా భూగర్భంలోకి వెళ్లి నూతన ప్రాజెక్ట్ కోసం తవ్వకాలు సాగించడం పూర్తిస్థాయి తీర చట్టాల ఉల్లంఘన కిందకే వస్తుందన్నది ప్రభుత్వం గుర్తించిందా ? లేదా ? అన్నది ప్రభుత్వ పెద్దలే చెప్పాలి.

ఘనంగా ఫిడే చెస్ టోర్నీ ప్రారంభం

బాబూరావు, సహాని ప్రారంభించగా, రెండో రౌండ్ పోటీలను ఎంవిఎస్ జ్యువలరీ రంగా ప్రారంభించారు. టాప్ సీడెడ్ క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. ఈ నెల 28వరకు జరిగే ఈ పోటీలలో విజేతలకు రూ. 6 లక్షల నగదు బహుమతితో పాటు, ఆకర్షణీయమైన ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. కార్యక్రమంలో చెస్ ఇన్ స్కూల్స్ మెంబర్ భీమారావు, ఏపీసీఏ సెక్రెటరీ ఎస్. మణికంఠ, శ్రీ చెస్ అకాడమీ డైరెక్టర్ వి. శ్రీకాంత్ పలువురు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

శ్రీవిశ్వ విద్యాసంస్థల 'సక్సెస్ మీట్'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీవేణి ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యంలోని శ్రీవిశ్వ విద్యాసంస్థ 2025 విద్యాసంవత్సరపు సక్సెస్ మీట్‌ను గురువారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ విద్యాసంస్థకు చెందిన ఎంపిసి, బైపిసి విభాగాల విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి, 2025లో 160కి పైగా విద్యార్థులు ఐఐటి,ఎన్ఐటి సీట్లను, 130కి పైగా ఎంబిబిఎస్ సీట్లు కైవసం చేసుకున్నారు. సక్సెస్‌మీట్‌లో ముఖ్యఅతిధిగా పాల్గొన్న నగర పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ చదువులోనే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఒత్తిడి లేని విద్యతో మంచి ఫలితాలను సాధించాలని సూచించారు గౌరవ అతిథులుగా డాక్టర్ పి.వి. సుధాకర్, డాక్టర్ పి. ఉషా పద్మశ్రీ, డాక్టర్ ఎంవిఎస్-ఎస్. బాపారావు , డాక్టర్ కె.స్వామి పాల్గొని విజేతలను సత్కరించారు. విద్యార్థుల ఈ చారిత్రాత్మక విజయానికి కారకులైన కళాశాల అధినేత కర్రి ధర్మరాజు, డైరెక్టర్లను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.



సక్సెస్ మీట్‌కు హాజరైన విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించాలని . విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్ రావు అన్నారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మద్దిలపాలెం, సిఎంఆర్ సెంట్రల్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అనేక రోడ్డు ప్రమాదాలకు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమే ప్రధాన కారణమన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు కావడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చిన్నాభిన్న మౌతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, అమలుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతున్నా ప్రజల సహకారంతోనే విజయవంత మౌతుందన్నారు. కార్యక్రమంలో విసిసి కన్వీనర్ కె.సుశీల, కోఆర్డినేటర్ సతీష్, తిరుపతిరావు, సిఎల్‌సి సెంటర్ నిర్వాహకులు విజయలక్ష్మి, శిరీష, ఉమ, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ శూన్యమని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూమంత్రి గుమ్మడి సంధ్యారాణి పీఏ వేధింపుల కేసులో బాధితురాలిని అరెస్టు చేయడం ప్రభుత్వ బరితెగింపు, రెడ్ బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట అని మండిపడ్డారు. తనకు అన్యాయం జరిగిందని ఒంటరి మహిళ పోలీసుల్ని ఆశ్రయిస్తే, మంత్రి సంధ్యారాణి డైరెక్షన్‌లో బాధితురాలినే నిందితురాలిని చేయడం దుర్మార్గమన్నారు. అధికార పార్టీ కార్యకర్తల్లా పోలీసులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మహిళలను వేధిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ కేబినెట్ సహచరి పీఏ వేధిస్తే ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. బాధితుడుని అరెస్టు చేసిబాధిత మహిళకు న్యాయం చేయాలని, లేకుంటే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత విచారణ జరిపి, నిందితుడుతో పాటు అతడికి సహకరించిన పోలీసులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన అల్లిపురం ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అల్లిపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ ముగిసింది. గురువారం టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడతాయన్నారు.

వికాస్ పాండేకు అవార్డు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వినియోగదారుల హక్కుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలలో విశేష కృషి చేసిన నగరానికి చెందిన కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్‌పాండేకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసింది. గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డును స్వీకరించారు.

అనుమానం, ఆవేశంతోనే హత్య

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : భార్యపై అనుమానం, ఆవేశంతోనే యలమంచిలి ధర్మవరం ఎస్సీ కాలనీ సచివాలయం పరిధిలోని స్క్రాప్ దుకాణంలో భార్యను భర్త హత్య చేశారని సిఐ ధనుజయరావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సిఐ వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన రాకేష్ అతని భార్య మాయ ధర్మవరంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. పదేళ్ల నుండి పరవాడ, యలమంచిలి ప్రాంతాల్లో స్క్రాప్ దుకాణాల్లో కూలీ పనులు చేసిన రాకేష్, రెండు నెలలు నుంచి యలమంచిలి ధర్మవరంలో సొంతంగా స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. భార్యపై అనుమానంతో నాలుగు నెలలుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 10.30 సమయంలో రాకేష్ బయటకు వెళ్లి వచ్చే సమయానికి మాయ ఎవరో తెలియని వ్యక్తితో ఫోన్లో సంభాషించడం చూశాడు. ఆవేశం తట్టుకోలేని భర్త రాకేష్, మాయాను తన చేతికి దొరికిన స్క్రూ డ్రైవర్‌తో చాతిపై భాగంలో పొడిచి తలను గోడకు గుద్దడంతో మాయకు తీవ్ర గాయాలయ్యాయి. స్పృహ కోల్పోయిన మాయను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మాయ చనిపోయిందని డాక్టర్ నిర్ధారించారు. ఇంచార్జి విఆర్‌ఓ పిల్లి మారేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. రాకేష్ పోలీసు స్టేషన్లో లొంగిపోయాడు. వీరికి ఆరు నెలల పాప ఉంది. కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో పాపను ఐసిడిఎస్ అధికారులు అందించినట్టు తెలిపారు. మాయ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఎవరు రాకపోవడంతో మాయ మృతదేహాన్ని యలమంచిలి మార్చురిలో భద్రపర్చినట్లు సిఐ తెలిపారు.

అదృశ్యమైన బాలిక కుటుంబీకుల చెంతకు..

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... బాలిక తల్లిదండ్రులతో విభేదించి ఈనెల 18వ తేదీన ఇంటి నుండి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బాలిక (16)ను ఒడిశా రాష్ట్రం రాయిరాంపూర్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. మల్కాపురం పోలీసుల ఒడిశా రాష్ట్రానికి వెళ్లి బాలికను తీసుకొచ్చారు. విచారణ తరువాత బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. తక్షణ స్పందన, సమన్వయంతో కూడిన దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానంతో కొద్దిరోజులలోనే బాలిక ఆచూకీ కనిపెట్టినట్లు సిఐ అప్పారావు తెలిపారు.

అవంతిలో గ్యాన్ టెక్నికల్ ఫెస్ట్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు గ్యాన్ 2025 పేరుతో జాతీయ స్థాయిలో సాంకేతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ శాలివాహన్ డైరెక్టర్ డాక్టర్ రితుపర్ణ దత్త, అసోసియేట్ డైరెక్టర్ కాగ్నిజంట్ భట్టాచార్జి పాల్గొని సాంకేతిక ఉత్సవంలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ఎక్స్‌పోర్టు టాక్స్‌పై విద్యార్థులకు వివరిస్తారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సుమారు 2 లక్షలు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందిస్తారని తెలిపారు.

గోల్ సాఫ్ట్‌బాల్‌లో వెల్లంకి విద్యార్థుల ప్రతిభ



విజయ చిహ్నం చూపిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఆనందపురం : రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా గోల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (సబ్ జూనియర్స్ బాలురు, బాలికలు) పోటీల్లో విశాఖపట్నం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. గుంతకల్‌లోని మాంటిసోరి పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో అనందపురం మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు తాతపూడి పూజిత, పడాల ధనలక్ష్మి, గోలగాని శిరీష, మాదాబత్తుల లోహిత, గండ్రెడ్డి లాస్య ప్రియ, వానపల్లి హర్షిత, మాదాబత్తుల గీతాంజలి తదితరులు నైపుణ్యమైన ఆటను ప్రదర్శించి విశాఖపట్నం జిల్లాను ద్వితీయ స్థానంలో నిలిపారు. విద్యార్థినుల ఈ విజయంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తోనంగి సరిత శిక్షణ కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మూలకుద్దులో క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో దివీస్ ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం పాత మూలకొద్దులో దివీస్ ఛాలెంజర్స్ ట్రోఫీ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దివి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఛాలెంజర్స్ ట్రోఫీలో 14 పంచాయతీల నుంచి 31 గ్రామాలకు చెందిన 32 జట్లు 48 లీగ్ మ్యాచులు, 15 నాకౌట్‌లతో మొత్తం 63 మ్యాచ్‌ల్లో తలపడతాయని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు జెర్సీలు, క్యాపులు, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. నెల రోజులపాటు జరగనున్న ఈ క్రికెట్ పోటీలకు దివీస్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.25 లక్షలు ఖర్చు చేస్తున్నామని మురళీకృష్ణ తెలిపారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్‌వి.రమణ, జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు, పి.జగదీష్, గోపీనాథ్, విజయభాస్కర్, సిఎస్ఆర్ అధికారి డి.సురేష్‌కుమార్, సిఎస్ఆర్ సిబ్బంది, క్రికెట్ క్రీడాకారులు, ఆర్గనైజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి



పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఉమర్ ఆ లీషా

ప్రజాశక్తి- భీమునిపట్నం : ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆ లీషా కోరారు. స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం భీమిలి శాఖ ఆధ్వర్యంలో పీఠం 24వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతిని పరిరక్షించు కోవడం ద్వారా మానవాళి మనుగడ సాధ్యమన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, ఉమర్ ఆ లీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం, అర కిలో చొప్పున కంది పప్పు, చింత పండు, పంచదార, వంట నూనె తదితర నిత్యావసర సరుకులను, దుప్పట్లను 40 మంది పేదలకు అందజేశారు. అనాధ శరణాలయానికి రూ.10 వేలు విలువైన 17 రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య డి.వెంకటరావు, పరవస్తు ఫణిశయన సూరి, ఆహ్వాన కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, డివి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



బోని గ్రామం సమీపంలో ఇటుక బట్టీల వద్ద పొలాల్లో అపహరణకు గురైన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ

ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం బోని రోడ్డులో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అపహరణకు గురైంది. రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటాన్ని ఆసరాగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని రైతులు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఆధారంగా పలువురు రైతులు వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటన జరిగి సుమారు మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయకపోవడంతో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. దీంతో పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరా లేక వ్యవసాయ పనులు నిలిచిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వాచ్‌మ్యాన్ మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కటిన్‌పేటకు చెందిన సమ్మిడి గడ్డప్ప (63) ప్రమాదవశాత్తూ బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్ఐ లలిత్ ఆదిత్య కథనం ప్రకారం... ప్రైవేట్ లే-అవుట్‌లో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్న గడ్డప్ప ఎప్పటి లాగానే బుధవారం సాయంత్రం 5గంటలకు డ్యూటీకి వెళ్లాడు. మృతుని కుటుంబీకుడు ఎం.సురేష్‌కుమార్ రాత్రి 7 గంటలకు భోజనం తీసుకెళ్లాడు. ఆ సమయంలో గడ్డప్ప అపస్మారక స్థితిలో ఉండడాన్ని చూసి చుట్టు పక్కల వారి సాయం తీసుకుని 108లో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుని కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లలిత్ ఆదిత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి: రావికమతం: రావికమతం మండలం టి.అర్జాపురం సమీపంలో రెండు బైకులు ఢీ కొనడంతో గురువారం నలుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. కాకినాడ జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన వాసు, వొమ్మంగి గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ బైక్ పై పాడేరు వెళుతున్నారు. మాడుగుల మండలం కె వల్లపురం గ్రామానికి చెందిన కోన జగ్గారావు పొంగలిపాక గ్రామానికి చెందిన శెట్టి నాయుడు బైకు పై నర్సీపట్నం వెళుతున్నారు. ఈ బైకులు ఎదురుగా ఢీ కొనడంతో నలుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వీరిని 108 ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలిక మృతి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంక్‌లో పడి మూడేళ్ల బాలిక మృతి చెందిన విషాద ఘటన ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామం వైఎస్ఆర్ కాలనీలో గ ు ం ు ఎా ం ు ం చోటుచేసుకుంది. ముచ్చర్ల గ్రామానికి చెందిన లంక గణేష్, జగదీశ్వరి దంపతులకు మూడేళ్ల కుమార్తె ఢిల్లీశ్వరి, ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు చాణుక్య ఉన్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఢిల్లీశ్వరి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ముళ్లపొదల మధ్యలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో కాలుజారి పడిపోయింది. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. సెప్టిక్ ట్యాంక్‌లో నీటిలో తేలియాడుతూ ఢిల్లీశ్వరి కనిపించింది. బాలికను పైకి తీసి తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలిక తండ్రి గణేష్ అన్నయ్య లంక అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎఎస్ఐ బాలం నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన ఢిల్లీశ్వరి

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని గిరిజన గ్రామమైన కొండంపూడిలో మూడు వరి కుప్పల దగ్ధం అయ్యాయి. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటినట్లు బాధితులు తెలిపారు. కొండంపూడి గ్రామానికి చెందిన చలుము పెంటయ్య, చల్మో దేవుడులకు చెందిన వరి చేనును కళ్ళంలో కుప్పలుగా వేశారు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుండి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాగా నిప్పులు చెలరేగి వరి కుప్పలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నేత వంటాకు కుమార్ నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అవినీతి అంతంతోనే సుపరిపాలన


మాట్లాడుతున్న ఐపిఎస్.భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -ములగాడ : అవినీతిని అంతం చేసినప్పుడే సుపరిపాలన సాధ్యమని జాతీయ సేవా పథకం విశాఖ జిల్లా నోడల్ అధికారి ఐపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. జివిఎంసి 60, 61 వార్డులలో సెయింట్ ఆన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలల జాతీయ సేవా పథకం యూనిట్ల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాలు రెండో రోజూ కొనసాగాయి. రెండవ రోజైన గురువారం సుపరిపాలన దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన వేర్వేరు సదస్సులలో ఆమె ప్రసంగించారు. సుపరిపాలన దేశ ప్రగతికి ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగులంతా ప్రజా సేవకులుగా, నీతి, నిజాయతీతో, జవాబుదారీతనంతో, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేసినప్పుడే దేశం అభివృద్ధిని సాధిస్తుందని, సుపరిపాలన ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం పల్లి వీధిలోని డిగ్రీ యూనిట్-1 వాలంటీర్లు ఆరోగ్య అవగాహనపై, ప్రియదర్శిని కాలనీలోని డిగ్రీ యూనిట్- 2 వాలంటీర్లు ప్రజల సామాజిక సమస్యలపై, వెంకన్నపాలెంలో డిగ్రీ యూనిట్- 3 వాలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వేను నిర్వహించారు. 60వ వార్డులోని జవహర్‌నగర్‌లో ఇంటర్మీడియట్ యూనిట్- 1 వాలంటీర్లు, ఇందిరా కాలనీలోని ఇంటర్మీడియట్ యూనిట్- 2 వాలంటీర్లు ఇంటింటి సర్వేను నిర్వహించారు. మొత్తం కార్యక్రమాలను సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు భాగ్యలక్ష్మి, అనసూయాదేవి, అంజలీదేవి, సంధ్యారాణి, నదియా సమన్వయం చేశారు.

26 నుంచి వైకుంఠ ఏకాదశి ఆన్‌లైన్ టిక్కెట్లు

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీ నిర్వహించే వైకుంఠ ఏకాదశి (ఉత్తర ద్వార దర్శనం)కి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26 నుండి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయని దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులందరూ దేవస్థాన ప్రకటన ప్రకారం దర్శన టిక్కెట్లకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

మురళీమాధవ విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-మాధవధార : మాధవధారలోని మురళీ మాధవ విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను జగద్గురు పీఠం కార్యదర్శి బిఆర్‌కె.రాజు ప్రారంభించారు. డిజిటల్ ఇండియా, క్లైమేట్ ఛేంజ్, గ్లోబల్ వార్మింగ్, సోలార్ ఎనర్జీ, స్పేస్ సెంటర్ తదితర నమూనాలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా బిఆర్‌కె.రాజు మాట్లాడుతూ, ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మురళీ మాధవ విద్యాలయం కరస్పాండెంట్ సనపల మురళీధర్, ప్రిన్సిపల్ సనపల సత్య, స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బిఆర్‌కె.రాజు

అదాని గంగవరం పోర్టు వాహనాలతో...

రహదారులు గుంతలమయం

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు వాహనాల రాకపోకలు పెరగడంతో రహదారులన్నీ గుంతలమయమయ్యాయి. దీంతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో లారీలు ఎక్కువ సంఖ్యలో ఉండి, టిప్పర్లు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం టిప్పర్ల సంఖ్య పెరిగి, లారీల సంఖ్య తగ్గింది. భారీ వాహనాలు ఎక్కువ సంఖ్యలో నడుస్తుండడంతో ఉన్న రహదారులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వై జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్ వరకు రెండువైపుల రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అదాని గంగవరం పోర్టు నుండి వాహనాలు నిత్యం నడవడం వల్ల ఈ రహదారులు శిథిలమవుతున్నాయి. 2024వ సంవత్సరంలో మరమ్మతులు చేసినప్పటికీ, మరల గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు రోడ్డుపై దుమ్ము, ధూళి పెరిగింది. జగ్గు సెంటర్, స్వతంత్ర నగర్, రామచంద్రనగర్, శ్రీనగర్, పరిసర ప్రాంత ప్రజలు వాహనాల ద్వారా వచ్చే దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్మా రోగులు మరింత ఇబ్బంది పడుతున్నారు. వేరే మార్గాల ద్వారా అదాని గంగవరం పోర్టు వాహనాలను తరలించాలని స్థానిక ప్రజా సంఘాలు కోరుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. స్థానిక అధికార ప్రజాప్రతినిధులు కూడా దీని పట్ల శ్రద్ధ చూపక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల సంఖ్య తగ్గించి, వ్యాగన్ల ద్వారా సరుకు ఎక్కువగా తరలిస్తామని గతంలో ఆ పోర్టు యాజమాన్యం చెప్పిన మాటలు నేటికీ అమలు కాలేదు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ప్రత్యేక మార్గాల ద్వారా వాహనాలను నడపాలని స్థానికులు కోరుతున్నారు.


రహదారి మధ్యలో గుంత


అదాని గంగవరం పోర్టు నుండి వస్తున్న భారీ వాహనాలు

అప్పన్నను దర్శించుకున్న శివరాజ్ సింగ్ చౌహాన్


కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామి శేష వస్త్రంతో ఆయనను సత్కరించి, అప్పన్న ప్రసాదాలను అందజేశారు. జ్ఞాపికగా స్వామివారి పటాన్ని మంత్రికి బహుకరించారు.

అప్పన్న నిత్యాన్నదానానికి రూ.1.16 లక్షల విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శివశక్తినగర్ (శివాజీపాలెం) ప్రాంతానికి చెందిన భక్తులు కాశిన వెంకటేశ్వరరావు తమ కుటుంబ సభ్యుల పేరున రూ.1,00,116 విరాళాన్ని గురువారం అందజేశారు. దాతలు దేవస్థాన ప్రోటోకాల్ కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్ వద్ద నగదును చెల్లించి రసీదు పొందారు. ప్రోటోకాల్ సీనియర్ సహాయకులు సూర్యనారాయణ బాండ్‌ను అందజేశారు. అనంతరం దాతలు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామి ప్రసాదాలను అందజేశారు. ప్రతి ఏటా అక్టోబర్ 16వ తేదీన దాత కోరుకున్న విధంగా ఈ విరాళంపై వచ్చే వడ్డీతో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్‌లో శాంతిభద్రతల ఎస్ఐగా గంట్యాడ సంతోష్, నేరవిభాగపు ఎస్ఐగా శివ్వాల సూర్యప్రకాశరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని సంతోష్, నేరాల నియంత్రణకు కృషిచేస్తానని సూర్యప్రకాష్ ఈ సందర్భంగా చెప్పారు.

అశ్రునయనాల మధ్య అప్పలనాయుడు అంతిమ యాత్ర

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆకస్మికంగా బుధవారం మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య గురువారం నిర్వహించారు. జివిఎంసి మూడో వార్డు పరిధి గాడు వీధిలో ఉన్న అతని నివాసం నుంచి శ్మశానవాటికకు భౌతికకాయాన్ని గురువారం అశ్రునయనాల మధ్య తీసుకెళ్లారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.మాలకొండయ్య, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద, పార్టీ నాయకులు చిక్కాల విజయ్‌బాబు, పలువురు జివిఎంసి కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ వార్డుల టిడిపి కార్యకర్తలు, అతని అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని అప్పలనాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని మృతికి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. దుఃఖంలో ఉన్న భార్య, 2వ వార్డు కార్పొరేటర్ చిన్ని కుమారిలక్ష్మిని, కుమారుడు, కుమార్తెను ఓదార్చారు.

సిపిఐ జెండా ఆవిష్కరణలు

ప్రజాశక్తి- యంత్రాంగం

పెందుర్తి : సిపిఐ శతవార్షికోత్సవం సందర్భంగా జివిఎంసి 97వ వార్డు పరిధి గిరిప్రసాద్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయం వద్ద గురువారం జెండాను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వందేళ్లుగా దేశంలో బడుగు, బలహీన, శ్రామిక వర్గాలకు కమ్యూనిస్టు పార్టీ అండగా నిలుస్తూ వస్తోందన్నారు. కార్మికులకు, కర్షకులకు, శ్రామికులకు ఎప్పుడు ఎక్కడ ఎలాంటి అవసరం వచ్చినా సిపిఐ నిలబడుతుందన్నారు. దేశమంతా హిందు వాదమే అన్నట్లుగా బిజెపి అసత్య ప్రచారం చేస్తోందని, ముస్లిములు, క్రైస్తవులు తదితర మైనారిటీలను అణగదొక్కడానికి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ అవిరళ పోరాటం సాగిస్తోందని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీన విశాఖలో జరిగే సిపిఐ భారీ ర్యాలీకి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ములగాడ : సిపిఐ శత వార్షికోత్సవం సందర్భంగా కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ ఏరియాలో పార్టీ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, నాయకులు ఎన్‌వి.త్రినాథ్, కె.శ్రీనివాస్, డి.గోపి, వై.కనకేశ్వరరావు, కామేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. వర్ధిల్లాలి మార్క్సిజం, లెనినిజం జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ప్రచారం చేశారు. శుక్రవారం నగరంలో జరిగే ప్రదర్శనకు సిపిఐ కార్యకర్తలు, సానుభూతిపరులు, కార్మిక నాయకులు హాజరుకావాలని కోరారు.

కె.కోటపాడు : సిపిఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా మండలంలోని మర్రివలస, పాతవలస, దాలివలస గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు గురువారం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అంటూ నినాదం తెచ్చింది కమ్యూనిస్టు పార్టీ అని, కె.కోటపాడు మండలంలో వందలాది ఎకరాల బంజరు భూములు బడుగు రైతులకు పంపిణీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి అప్పలనాయుడు, పొంతపల్లి రామారావు, వేచలపు కాసుబాబు, దమ్ము ముత్యాల నాయుడు, సీమసిరి సూర్యనారాయణ, చప్పా కోటి, ఇల్లాకు రాము పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామం అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సిపిఐ సీనియర్ నాయకులు సుర్ల శ్రీరామమూర్తి పతాకావిష్కరించారు. ఈ కార్యక్రమంకు హాజరైన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, పేద రైతులందరికీ భూమిపై హక్కులను సాధించి పెట్టింది కమ్యూనిస్టు పార్టీనే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ, కిల్లాడ అప్పలనాయుడు, మర్రి అప్పలనాయుడు, కె.రాము, ఎ.అప్పలనాయుడు, ఎల్.సత్తిబాబు, ఎం.నాయుడు పాల్గొన్నారు.


గిరిప్రసాద్‌నగర్‌లో సిపిఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యమ నేతపై నిర్బంధం దారుణం

అప్పలరాజుపై పీడీ యాక్ట్‌ను ఖండిస్తూ నిరసనలు


కె.కోటపాడు మండలం సూరెడ్డి పాలెంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్టును రద్దు చేసి ఆయన్ను భేషరత్తుగా విడుదల చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కొత్తూరు జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారులపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించి అక్రమంగా నిర్బంధించడం అన్యాయమన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వ వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ప్రజా పోరాటాలపై నిర్బంధాలు ప్రయోగిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గూనూరు వరలక్ష్మి, రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, ఎస్‌వి నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, సాంబశివరావు, దేవుళ్ళు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యాన మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, మండల నాయకులు వనము సూర్యనారాయణ, ఈ నాయుడుబాబు, సూరెడ్డి అప్పలనాయుడు, బొడ్డు రామునాయుడు, వనము పైడిబాబు, బొడ్డు తాతమ్మనాయుడు, వనము సత్యం పాల్గొన్నారు.


యలమంచిలి టౌన్ : రాంబిల్లి మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారులపై తప్పుడు కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


రాంబిల్లిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, కార్మికులు

అణుకు గ్రామస్తుల నిరసన

ఎస్.రాయవరం : సిపిఎం నేత అప్పలరాజు అక్రమ అరెస్టుపై కోటవురట్ల మండలం అణుకు గ్రామ ప్రజలు మండిపడ్డారు. గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పలరాజు ప్రజలకు మేలు చేసే వ్యక్తిగాని అన్యాయం చేసే వ్యక్తి కాదని, అలాంటి వ్యక్తిపై అన్యాయంగా ఈ ప్రభుత్వం కేసులు మోపి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, అణుకు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న అణుకు గ్రామస్తులు


దాసును సత్కరించిన టిడిపి నేతలు

తమరాన దాసుకు అభినందనలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన తమరాన సింహాద్రి అప్పన్న (దాసు)ను మండల తెలుగుదేశం నాయకులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా సాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు ఎంవివి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, బుచ్చయ్యపేట పిఎసిఎస్ అధ్యక్షులు దొంకన అప్పలనాయుడు, మనిషా సతీష్, దొండ గిరిబాబు, ఎంపీటీసీ కంచిపాటి శ్రీనివాసరావు, కోరుకొండ రవికుమార్, ఎలంకాయల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు సోలార్ విద్యుత్‌పై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని బుచ్చయ్యపేట, పోలేపల్లి, దిబ్బిడి గ్రామాల్లో సోలార్ విద్యుత్‌పై ఈ నెల 27న ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వడ్డాది సెక్షన్ ఏఈ ఎం.వెంకటరమణ తెలిపారు. శనివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు బుచ్చయ్యపేట సచివాలయం వద్ద, 12.15 నుండి 1.30 గంటల వరకు పోలేపల్లిలోనూ, 2.30 నుండి 5 గంటల వరకు దిబ్బిడి సచివాలయం వద్ద ఈ అవగాహన కార్యక్రమం జరుగుతాయని, వినియోగదారులు హాజరు కావాలని కోరారు.

వాకపల్లిలో భారీ కొండచిలువ హతం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలం వాకపల్లి మెట్ట సమీపంలో గురువారం భారీ కొండచిలువ ప్రత్యక్షమవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. పొలంలో పనులు చేసుకుంటున్న రైతులు సుమారు పది అడుగులకు పైగా పొడవున్న పామును గమనించి ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అనంతరం అప్రమత్తంగా వ్యవహరించిన వారు పామును హతమార్చారు. విషయం తెలిసిన గ్రామస్తులు సంఘటనా స్థలికి చేరుకుని వీక్షించారు. ఇంత పెద్ద పాము గ్రామంలో కనిపించడంతో స్థానికులలో చర్చనీయాంశంగా మారింది.


అప్పలరాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-యస్.రాయవరం : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టి అక్రమంగా అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఏపి గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకాడ దేముడునాయుడు, రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పరామర్శించారు. గురువారం అప్పలరాజు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ అప్పలరాజుపై పీడీ యాక్ట్ ప్రయోగించడంలో రాజకీయ కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇలా ప్రజా ఉద్యమకారులపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదన్నారు. అప్పలరాజు కుటుంబానికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మోర్త సత్యనారాయణ, మనబాల రాజేష్, గోసల స్వామి, పీక్కి రమణ, మైలపల్లి కాశీ, బొంది నూకరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అప్పలరాజు కుటుంబ సభ్యులతో గొర్రెలు మేకలు పెంపకం దారుల సంఘం నేత దేముడు నాయుడు తదితరులు

విడుదల చేయాలి

- వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ



ప్రజాశక్తి-నక్కపల్లి : సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్ట్‌ను రద్దు చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న అప్పలరాజుపై అక్రమ కేసులు బనాయించి, విశాఖ సెంట్రల్ జైలుకు తరలించడం అమానుషం, అప్రజాస్వామిక చర్య అని అన్నారు. నక్కపల్లి ప్రాంతంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా నిర్వాసితులు చేపట్టిన అనేక పోరాటాల్లో అప్పలరాజు పాల్గొని, ఈ ప్రాంత రైతాంగానికి అండగా నిలిచారన్నారు. రాజయ్యపేట మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమంలో కూడా అప్పలరాజు పాల్గొని, మత్స్యకారులకు మద్దతు తెలపడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలనే ప్రభుత్వ ప్రయత్నం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా పోరాటం చేస్తున్న అప్పలరాజు పై ప్రభుత్వం అక్రమంగా పెట్టిన పీడీ యాక్ట్ ను రద్దుచేసి, తక్షణమే ఆయన్ను బేశరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ రావలమ్మ పాలెం గ్రామంలో సబ్బవరపు రామునాయుడు ఇంటి దగ్గర నుండి మేడపురెడ్డి వారి వీధి గెడ్డ వరకు సిసి రోడ్డు నిర్మాణానికి లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొంగలి దేముడుబాబు, నాయకులు సబ్బవరపు మనోహర్ గాంధీ, సబ్బవరపు రమణ, సబ్బవరపు చిన్నమనాయుడు, గొంప పెదరమణ, గొంప ముత్యాలనాయుడు, జక్కాన శ్రీరామూర్తి, జక్కాన సూర్యనారాయణ, మేడపురెడ్డి పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండలం ఈ.బోనంగి గ్రామపంచాయతీ పరిధి ఫార్మాసిటీ కాలనీ సమీపంలో సంజీవ పర్వతంపై నిర్మించిన శ్రీఅభయ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణం పనులను గురువారం జనసేన నాయకులు పంచకర్ల ప్రసాద్ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు రూ.5లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాధరావు, మాజీ ఎంపిపి మానసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు వియ్యపు చిన్నా, బొడ్డపు శ్రీనివాస్ కాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు వరలక్ష్మి గొర్లె ఎరుకునాయుడు, మోటూరు సన్యాసినాయుడు, బద్దపు రమణ, అట్టా సన్యాసి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న కూటమి నేతలు

బొజ్జన్న కొండ గుహలో బౌద్ధ బిక్షువుల ప్రార్థనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండను బర్మా బౌద్ధ బిక్షువులు సందర్శించి, కొండపై గుహలో బుద్ధ భగవానునికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. బొజ్జన్నకొండ బౌద్ధ శిల్ప కళా నైపుణ్యమునకు నిదర్శనమని మయన్మార్ బౌద్ధ బిక్షువులు వెనరబుల్ ఆయిపాల భాన్తేజీ వారి బృందం వెల్లడించింది. కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధి బోర వేణుగోపాల్ గౌతమ్, సమాఖ్య సభ్యుడు బోర సిద్ధార్థ గౌతమ్, అనకాపల్లి బుద్ధిస్ట్ సొసైటీ ప్రతినిధులు నేలపూడి బాలరాజు, గుడాల అచ్యుత రామారావు, పూడి దయాల్ రాజు, సావల నూకరాజు, బోర గగన్ గౌతమ్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి గ్రామంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఒక ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బాధిత షేక్ ఈశ్వరమ్మ కుటుంబం తెలిపిన వివరాలు ప్రకారం... కుటుంబ సభ్యులంతా గురువారం ఉదయం ఇంటి నుంచి చోడవరం షాపింగ్‌కు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి మంటలు వస్తున్నాయని గ్రామంలోని కొంతమంది ఫోన్ చేసి తెలపడంతో వెంటనే గ్రామానికి చేరుకున్నాము. వీరు వచ్చేలోగానే ఇల్లు మొత్తం మంటలు వ్యాపించాయి. వెంటనే చోడవరం అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే సర్వం కాలి బూడిదైంది. ఇటీవల డీఎస్సీలో ఉద్యోగ అర్హత సాధించిన షేక్ అప్పుసాహెబ్ మాట్లాడుతూ రూ.5 లక్షలు, 8 తులాల బంగారం, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్ పోర్ట్‌తో సహ అన్ని కాలిపోయాయని, కట్టుబట్టలతో మిగిలామని కన్నీరుమున్నీరై విలపించారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటన ఎలా జరిగిందన్న విషయాలపై ఆరా తీశారు. సర్వం కోల్పోయిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.


కాలిపోయిన బీరు, వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు



సిఎం నిధి పత్రాలు అందజేస్తున్న గొంతిన శ్రీనివాసరావు

సిఎం సహాయ నిధి మంజూరు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని సోమవరం, ఏనుగుతుని గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి పత్రాలను గురువారం టిడిపి మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు పంపిణీ చేశారు. సోమవరం గ్రామానికి చెందిన గొంతిన శాంతి కుమారికి రూ.24 వేలు, ఏనుగుతుని గ్రామానికి చెందిన ఉప్పులూరు సూర్యనారాయణకు రూ.37 వేలు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో గొంతిని చిరంజీవి, ఉప్పులూరి అప్పలనాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, కలిగట్ల వీరబాబు, మజ్జి ప్రసాద్, తెరపల్లి శ్రీను, మదపరెడ్డి గిరిబాబు, నిమ్మదల నూకరాజు పాల్గొన్నారు.

28 నుంచి నాటికల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జార్జ్ క్లబ్, మహతి క్రియేషన్స్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు బివిఎంకె జోగి నాయుడు, కార్యదర్శి కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. క్లబ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజానికి సందేశం ఇచ్చే నాటికలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. పోటీలకు కన్వీనర్‌గా కేఏం.నాయుడు వ్యవహరిస్తారన్నారు. ప్రతి నాటికకు బహుమతులు అందిస్తామన్నారు. సమావేశంలో కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, డైరెక్టర్ కాండ్రేగుల రామ అప్పారావు, డైరెక్టర్ ఆడారి శ్రీనివాసరావు, డైరెక్టర్ నర్సింహరావు, పగడాల వీరభద్రరావు, రాపేటి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కోర్టు శాశ్వత భవనాలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి కోర్టు కాంప్లెక్స్ శాశ్వత భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేలా సహకరించాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు హర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం కలిసి వినతిని అందజేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో కోర్టు నడవడం, స్థల భావం కూడా ఉండటంతో సమస్య నెలకొందని, ప్రభుత్వం నుంచి స్థల సేకరణకు అనుమతి లభించేలా అందరి నాయకులతో కలిసి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బంధం వెంకట రమణ, స్పోర్ట్స్ సెక్రటరీ మోహన్, సీనియర్ న్యాయవాదులు నరసింహం, రమణయ్య, సాయి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. వ్యవసాయదారుల సంఘ ఉపాధ్యక్షులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు సంఘీభావాన్ని తెలియజేశారు. రైతు బజార్ ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. రైతు బజార్ ఎప్పుడు ప్రారంభిస్తారో తేదీని ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బొట్టా చిన్ని యాదవ్, దళిత బహుజన ఆదరణ సేవా సమితి జిల్లా అధ్యక్షులు కొల్లి చిన్న అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, అట్లబోయిన గౌడ సంఘం నాయకులు శివాజీ పాల్గొన్నారు.

శాంతి కోరుతూ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఉగ్రవాదం, తీవ్రవాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ మహమ్మద్ అలీ రజా విశాఖ మంగమారిపేట సముద్ర తీర నుండి చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం అనకాపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు.

రామాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని దార్లపూడి గ్రామంలో నూతన రామాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి దర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొరుప్రోలు పిసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ క్రషింగ్ ప్రారంభించాలి

- రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి

- ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో వెంటనే క్రషింగ్ ప్రారంభించాలని, గతేడాది చెరుకు సరఫరా చేసిన రైతులకు, కష్టపడి పనిచేసిన కార్మికులకు వెంటనే బకాయిలు విడుదల చేయాలని, ఫ్యాక్టరీని ఆధునికరించాలని కోరుతూ రైతు, కార్మిక సంఘాల గురువారం ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు ఎస్వి నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, దేముళ్ళ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, నాయన బాబు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ 2024-25 సీజన్లో రైతులకు బకాయిలు, కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించకుండా ఇక్కడి చెరుకును వేరే ప్రాంతంలోని సుగర్ ఫ్యాక్టరీలకు తరలించే నిర్ణయంతో రైతులు అధోగతి పాలయ్యారన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధినిస్తున్న ఫ్యాక్టరీలో క్రషింగ్ నిర్వహించకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో నిధులు విడుదల చేసి ఫ్యాక్టరీని ఆధునికరిస్తే ఈ ప్రాంత చెరుకు రైతులు, కార్మికులు రోడ్డున పడకుండా కాపాడవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడంతో రాష్ట్రంలోనే సహకారరంగంలో నడుస్తున్న ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూసివేత దిశగా తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు చెల్లించి, ఫ్యాక్టరీని తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు

టిడిపి పార్లమెంట్ కార్యదర్శిగా అప్పలరాజు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకు నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఈపు అప్పలరాజు అనకాపల్లి పార్లమెంట్ టీడీపీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. తనకు ఈ పదవి దక్కినందుకు పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి గండి బాబ్జికి, బర్నికాన సాయినాధరావుకి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులకు, మండల సమన్వయ కమిటీ సభ్యులకు, అసకపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.




ఈపు అప్పలరాజు, రేసుపూడి రమణ

అధికార ప్రతినిధిగా రమణ

సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయితీ శివారు గణపతి నగర్ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు రేసుపూడి రమణ అనకాపల్లి జిల్లా పార్లమెంట్ టీడీపీ అధికారి ప్రతినిధిగా ఎంపికయ్యారు. తనకు ఈ పదవి దక్కినందుకు పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జికి, బర్నికాన సాయినాధరావుకి, మండల టీడీపీ నాయకులకు, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

టిడిపి బలోపేతానికి కృషి : తాతయ్యబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. జిల్లా అధ్యక్షులుగా ఇటీవల రెండో సారి నియమితులైన ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నాయుడుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు మరోసారి పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు అధినేత చంద్రబాబు, లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు, సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40 మంది కార్యవర్గ సభ్యులను నియమించారని, వారందరూ పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయిలో కృషి చేయాలని కోరారు. అనంతరం పులువురు నాయకులు అధ్యక్ష కార్యదర్శులను సత్కరించారు. కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మల్ల జగన్నాధం కళ్యాణమండపంలో జరిగిన ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. ప్రతి నెల క్రమం తప్పకుండా ఈ ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామనిరోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు తెలిపారు. వెన్నుపూస నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, గ్యాస్ట్రిక్ వంటి సమస్యలున్న వారికి ఈ వైద్య శిబిరం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. సుమారు 200 మందికి ఉచిత ఆయుర్వేద వైద్యం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రైనర్ బుద్ధ సత్యనారాయణ, కాండ్రేగుల జగన్నాధరావు, బుద్ధ రమణాజీ, రాపేటి నారాయణరావు, శరగడం శంకర్రావు, అధిక సంఖ్యలో రొటేరియన్స్ పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు సత్కారం

ప్రజాశక్తి-యస్.రాయవరం : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన బత్తుల తాతయ్యబాబు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడును అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ఐటిడిపి అధ్యక్షులు భీమరిశెట్టి శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి వారి నాయకత్వం మరింత దోహదపడాలని ప్రజాసేవలో వారి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

దేవరాపల్లి : టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబును దేవరాపల్లి మండల టిడిపి ప్రధాన కార్యదర్శి డిడి నాయుడు గురువారం ఆయన స్వగ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొర్రుపోటు నరసింహమూర్తి, కలిగొట్ల గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కోటకల లక్ష్మణరావు, బండారు రామారావు మాస్టారు పాల్గొన్నారు.



తాతయ్యబాబును సత్కరిస్తున్న నాయుడు తదితరులు

వడ్డాదిలో సోలార్ లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో గురువారం సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ సిఫారసు మేరకు కడప వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి తన ఎంపీ గ్రాంట్ నుండి రూ.15 లక్షలు నిధులు విడుదల చేశారు. వీటిలో రూ.10 లక్షలతో కొండెంపూడిలో స్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. మిగిలిన రూ.5 లక్షలతో వడ్డాదిలో రైతులు పొలాలకు వెళ్లే వివిధ రహదారులలో సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. జెడ్పిటిసి దొండా రాంబాబు ఆధ్వర్యంలో వడ్డాది కస్పా రోడ్డు, స్మశాన వాటికలు వద్ద 20 సోలార్ లైట్లు బిగించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, స్థానిక వార్డు సభ్యులు గుమ్మడి ప్రసాదు, బొబ్బరి ఈశ్వరరావు, మురళి, వైసీపీ నేతలు మస్తాన్, తురాయి మనోహర్, బైన సన్యాశిరావు, ఎస్.కొండబాబు, గండిబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వడ్డాది : ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న స్నేహితురాలి కుటుంబానికి తన చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. వడ్డాది కేవిడి జెడ్పీ హైస్కూల్లో 1998-99లో టెన్త్ పూర్తి చేసిన కె.అప్పారావమ్మ భర్త కరుణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అప్పారావమ్మతో కలిసి టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.45,500 సమకూర్చారు. గురువారం వడ్డాదిలో అప్పారావమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఈ మొత్తాన్ని అందజేశారు. స్నేహితురాలికి ధైర్యం చెప్పి ఆమె భర్త త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల దొండా రమేష్, ఎస్.వెంకట్, వి.కిషోర్, తమ్మునాయుడు, కొండబాబు, ఎమ్ఎమ్ నాయుడు, ఏ.నానాజీ పాల్గొన్నారు.




కుటుంబాన్ని పరామర్శిస్తున్న స్నేహితులు

పెన్షనర్ల భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ యలమంచిలి పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ వారు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సోమేశ్వరరావు, కార్యదర్శి సాంబమూర్తి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆరిలోవలో పాస్టర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న గంగరాజు

ప్రజాశక్తి-కశింకోట: మండలంలోని జమ్మాదులపాలెం గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యాక్షులు కరక సోమినాయడు జ్యోతి ఆధ్వర్యంలో కిస్మిస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకులకు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైసిపి నేత మలసాల రమణారావు, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగ లక్ష్మి గున్నయ్యనాయుడు, గొల్లవిల్లి శ్రీను, మలసాల కిషోర్, కొన నాగేశ్వరరావు, బుదిరెడ్డి రామారావు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల సెయింట్ ఫాల్ క్యాథలిక్ చర్చ్, 84వ వార్డు సిరసపల్లిలో గల ఊటల మినిస్ట్రీ చర్చల్లో గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ శుభాకాంక్షలు తెలియజేశారు.

బుచ్చయ్యపేట : మండలంలోని బుచ్చయ్యపేట, దిబ్బిడి, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దిబ్బిడి చర్చిలో పాస్టర్ రాజేష్ ప్రార్థనలు చేశారు.

సబ్బవరం : స్థానిక కేథలిక్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొని చర్చి పారిస్ కౌన్సిల్ ఆధ్వర్యాన నిరుపేదలకు నిత్యవసర సరుకులు, చీరలు, కేకులు, పండ్లు పంపిణీ చేశారు. అంతకాపల్లి పంచాయతీ శివారు ఉన్న గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చిలో మినిస్ట్రీస్ అండ్ ట్రస్ట్ అధ్యక్షుడు పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొని 30 మంది నిరుపేదలకు నిత్యవసర సరుకులు, ప్రయాణ ఖర్చులు అందజేశారు. కల్వరి అపోస్తలిక్ చర్చిలో బిషప్ డాక్టర్ ఎం.జాన్‌పాల్ ఆధ్వర్యంలో వందమంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీటీసీ బయలుపూడి దేముడు, కర్రి కనకరాజు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, భరణికాన సాయినాథరావు పాల్గొన్నారు

యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, రెహబోత్ చర్చి, ఆర్‌సిఎం చర్చి, యునైటెడ్ చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ సభ్యులకు విందు ఏర్పాటు చేశారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం సీయోను ప్రార్థన మందిరంలో నిస్సి మినిస్ట్రీస్ డైరెక్టర్ రెవ. బిషప్ టైటస్ గొర్లె, గ్రేస్ దంపతుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్‌ఐ సత్యనారాయణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాలిబాబు దంపతులు సభ్యులకు వస్త్ర దానం చేశారు. మండలంలోని ఏ.కొత్తపల్లిలో పాస్టర్ సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ పాల్గొని కేక్ కట్ చేశారు. వడ్రపాలెం చర్చిలో దైవజనులు బంగారి సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చిన్నారులు ప్రత్యేక వేషధారణలతో అలరించారు.

గొలుగొండ: గొలుగొండ ఎస్సీ కాలనీ ఫెయిత్ చర్చిలో పాస్టర్‌లు నతానియేలు, ప్రేమ్ కుమార్ ఆద్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, సీనియర్ నాయకులు కుత్సం లక్ష్మినారాయణ, తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భూపతి లోవరాజు, అంబేద్కర్ ఇండియన్ మిషన్ సభ్యులు(ఎయిమ్) సరమండ వీరబాబు, బొర్రా రాజుబాబు, గండేపల్లి రాము పాల్గొన్నారు.

మాడుగుల: ప్రేమ, కరుణ, శాంతి సందేశాన్ని క్రైస్తవులకు అందించిన దేవుని కుమారుని జననం క్రిస్మస్ అత్యంత ముఖ్యమైన రోజు అని మండల పరిషత్ అధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకట రాజారాం అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో క్రైస్తవ సోదరులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీపీ కేక్ కట్ చేసి క్రైస్తవులకు పంపిణీ చేశారు.

నక్కపల్లి: మండలంలోని క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నక్కపల్లి, ఉద్దండపురం, కాగిత, వేంపాడు, చందనాడ, డిఎల్ పురం, చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుద్దీకరణలతో అలంకరించారు. పలువురు రాజకీయ పార్టీ నాయకులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ పలు వేడుకలలో పాల్గొన్నారు. మెయిన్ రోడ్డులోని రీడింగ్ రూమ్‌కు ఎదురుగా ఉన్న చారిత్రాత్మక లండన్ చర్చిలో జరిగిన వేడుకలకూ హాజరయ్యారు. అఫీషియల్ కాలనీలో ఆల్బర్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. సూర్యాబాగ్‌లోని ట్రినిటీ లోతరం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. క్రిస్మస్ అంటే ఒక పండగ మాత్రమే కాదని, అది ప్రేమ, క్షమ, త్యాగం, సేవ అనే విలువలను మన జీవితాల్లో నాటే పర్వదినమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ డాక్టర్ ఎన్.జేసు రత్నకుమార్ పాల్గొన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పొడుగు కుమార్, కీర్తి ప్రసాద్, బండారు అప్పారావు పాల్గొన్నారు. మహిళలకు చీరలు, స్వీట్స్ పంపిణీ చేశారు. టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌టిఆర్ వైద్య సేవ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కార్యాలయంలో విల్లూరి చిన్న తల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, 33వ వార్డు క్లస్టర్ ఇంచార్జి తిరుమల దేవి పాల్గొన్నారు.



క్రిస్మస్ సందేశం ఇస్తున్న స్పీకర్ అయ్యన్న

ఆనందపురం : ఆనందపురం రవీంద్రభారతి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శాంతా క్లాజ్, మరియమ్మ, దేవదూతలు, ఏసుక్రీస్తు వేషధారణలతో అలరించారు. పాఠశాల డీన్ ఉమామహేష్, ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రవికుమార్, విలియం కేరి పాల్గొన్నారు. కీటిన్‌పేట చర్చిలో ప్రార్థనలు చేశారు.

ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు టిడిపి నాయకులు కాకి గంగరాజు ఆధ్వర్యంలో వార్డులో ఉన్న 18 చర్చిల్లో క్రిస్టియన్ సోదరులకు స్వీట్లు పంపిణీ చేశారు. అన్ని క్రిస్టియన్ ప్రార్థనా మందిరాలకు వెళ్లి పాస్టర్ల ఆశీర్వాదం తీసుకున్నారు. వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముగడ రాజారావు, గాడి సత్యం, ఎం.కృష్ణంరాజు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తగరపువలస : జివిఎంసి 1వ వార్డు యువత అధ్యక్షులు గరే సదానంద, పాస్టర్ రాజు ఆధ్వర్యాన పేదలకు, చిన్నపిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్ రాజు, క్రైస్తవ సోదరులు కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాగోతి కొండబాబు, తమ్మిన నరసింహమూర్తి, తమ్మిన గురినాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి శాంతిపురంలోని గ్రేస్ బాపిస్టు చర్చిలో బిషప్ పాల్ విక్టర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కటుమూరి సతీష్, సేనాపతి అప్పారావు, బలిరెడ్డి గోవిందరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

'మిడ్డే మీల్'ను ప్రయివేటీకరిస్తే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: మిడ్డే డే మీల్స్ పథకాన్ని ప్రైవేటుపరం చేస్తే ఉద్యమిస్తామని సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు కామిరెడ్డి ప్రసన్న తెలిపారు. గురువారం నర్సీపట్నం సిఐటియు కార్యాలయంలో మిడ్డే డే మీల్స్ కార్మికుల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మిడ్డే డే మీల్స్ పథకాన్ని స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడానికి సిద్ధపడటాని ఏపీ మిడ్ డే మీల్స్ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మిడ్డే డే మీల్స్ పథకం కార్మికులకు కనీస వేతనాలు లేకపోయినా, ఉద్యోగ భద్రత ఇవ్వకపోయినా పని చేస్తూ వస్తున్నామన్నారు. ఇంతకాలం కార్మికులతో వెట్టి చాకిరి చేయించికుని ఈ పథకాన్ని నిర్వహణ పేరుతో ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడాన్ని కార్మికులకు అన్యాయం చేయడమే అని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ప్రైవేట్ పరం ఆపాలని, బకాయి పడిన బిల్లులను తక్షణమే చెల్లించాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మిడ్డే మీల్స్ మండల అధ్యక్షులు నూకరాజు, సత్యవతి, లక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కంటారం పంచాయతీలో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ పరిధిలో పాడైన వీధిలైట్లను మరమ్మతు చేసి, అవసరమైన చోట నూతన విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. చాలాచోట్ల వీధిలైట్లు పనిచేయక రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. వీధి లైట్లు ఏర్పాటు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



వీధిలైట్లు వేయిస్తున్న సర్పంచ్



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు, అర్చకులు

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాసుడు అశ్వ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను అశ్వ వాహనం, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, నేతలు

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి: రావికమతం: కొత్తకోట ఎస్సీ బాయ్స్ వసతి గృహంలో నూతన టాయిలెట్స్ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ కోన లోవరాజు, టిడిపి నాయకులు కోట గోవిందు, పలువురు గురువారం భూమి పూజ చేశారు. మండలంలో కొత్తకోట ఎస్సీ వసతి గృహంలో నూతన టాయిలెట్స్ నిర్మాణానికి రూ.30 లక్షలు సి ఎస్ ఆర్ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.

పలుచోట్ల వాజ్‌పేయి జయంతి

ప్రజాశక్తి-సబ్బవరం : మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు స్థానిక బిజెపి కార్యాలయంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు శరగడం శంకరరావు, చొక్కాకుల గోవింద పాల్గొన్నారు.

మాడుగుల: మాజీ భారత ప్రధాని అటల్ బీహారీ వాజపేయి జయంతి వేడుకలు మాడుగుల బస్టాండ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు వాజ్‌పేయి చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టా గంగయ్య, మండల నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకిలోని బిజెపి కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు, వృద్ధులకు, జాతీయ రహదారి పక్కన నివసించే నిరుపేద వృద్ధులకు 150 రగ్గులను బిజెపి నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, మీసాల రాము నాయుడు, కెవిఎన్.కృష్ణారావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఆయన కాంస్య విగ్రహం వద్ద బిజెపి ఆధ్వర్యంలో జరిగాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను తిలకించిన కర్ణాటక హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి జిల్లా ఏజెన్సీ అందాలు అద్భుతమని కర్ణాటక హైకోర్టు జడ్జి రామ్ నాథ్ హెగ్డే కొనియాడారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు రెండు రోజులలో అల్లూరి ఏజెన్సీలో సందర్శించిన బిజీ బిజీ గా గడపారు. గురువారం అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో ఉన్న శివాలయాన్ని కుటుంబ సమేతంగా తిలకించారు. ఏజెన్సీ ప్రాంతాల అందాల అద్భుతలను వీక్షిందుకు గురువారం సందర్శించారు. జిల్లా కేంద్రం నుండి తిరుగు ప్రయాణంలో ముందుగా కాశీపట్నం గ్రామంలో వెలిసిన శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



క్రికెట్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నేత రాంకీ

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : జనవరి 4వ తేదీన అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఆటల పోటీలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ గురువార ప్రారంభించారు. అనకాపల్లి మండలం కొత్తూరు జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో రామాపురం కాలనీ గ్రౌండ్లో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన ఆ ఆర్గనైజర్స్ పందల సత్య గోవింద్, జ్యోతుల గణేష్, నీటిపల్లి రాజుకి అభినందనలు తెలిపారు. అనంతరం ఇరు టీములకి టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబర్ 25 నుంచి జనవరి 3 వరకు నిర్వహించు మ్యాచ్లో 54 టీంలు పాల్గొంటున్నాయి. గెలుపొందిన విజేతలకు జనవరి 4న నిర్వహించబోయే జన్మదిన వేడుకల్లో బహుమతులను అందజేస్తారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక సబ్ స్టేషన్ మెయింటినెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక, నాగులపల్లి, అరబ్బుపాలెం, ఒంపోలు, ఉమ్మలాడ, తిమ్మరాజుపేట, వాడ్రపల్లి, పాత నాగవరం, కొత్త నాగవరంతో పాటు మరికొన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం 11కేవీ అవని ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం, పాత కన్నూరు పాలెం, తీడ, చరకం, అడ్డం, జి.భీమవరం, సుందరయ్య పేట, ఆనందపురం, కొత్తూరు, కొత్తఅచ్చర్ల, అచ్చర్ల, కచ్చులపాలెం, సింగవరం, మాసయ్యపేట, గోకవానిపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ సరాఫరా కూడా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహరించాలని ఈఈ కోరారు.

ఎఎన్‌పిఆర్ కెమెరాలతో నిఘా

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : పట్టణంలో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఎన్‌పిఆర్ కెమెరాలతో నిఘా పెడుతున్నట్లు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సిఐ వెంకట నారాయణ అన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రెండు రోజుల్లో 36 మంది వాహనదారులను గుర్తించి, చలానాలు జారీ చేశారు. వారికి గురువారం ప్రత్యేక కౌన్సెలింగ్, అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ లేకపోవడం, సెల్ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నామని చెప్పారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ వెంకట నారాయణ

జోరుగా సిఐటియు మహాసభ ప్రచారం

సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో జరుగనున్న నేపథ్యంలో గురువారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం హోరెత్తింది. విశాఖలో పుస్తక మహోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. శ్రామిక ఉత్సవ్ జయప్రదానికి ఆటో ప్రచార జాతా ప్రారంభించారు. కశింకోట మండలంలోని క్రెబ్స్ కంపెనీ వద్ద గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు.



విశాఖ రవీంద్ర నగర్‌లో ఆటో జాతాను ప్రారంభించి మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి- ఆరిలోవ : విశాఖలో ఈ నెల 27న నిర్వహించబోయే విశాఖ పుస్తక మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను డిఇఒ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక మహోత్సవం నిర్వహణ ఉద్దేశాలు, లక్ష్యాలను డిఇఒకు నిర్వాహకులు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ వివరించారు. ప్రత్యేకంగా పుస్తక పఠనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంపొందించడం, విశాఖను ఒక సాహిత్య కేంద్రంగా మరింత బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పుస్తక మహోత్సవాన్ని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రారంభించ నున్నట్లు ఎంవిఎస్. శర్మ చెప్పారు. డిఇఒ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్న ప్రజలు అధికంగా నివాసం ఉండే విశాఖలో ఇటువంటి పుస్తక మహోత్సవాలు చాలా అవసరమన్నారు. ప్రజలంతా ఈ పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకొని పుస్తక పఠనాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, శంకర్, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తక మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

శ్రామిక ఉత్సవ్ జయప్రదానికి ఆటో ప్రచార జాతా ప్రారంభం

జివిఎంసి 10వ వార్డు పరిధి రవీంద్రనగర్ బస్టాపు వద్ద శ్రామిక ఉత్సవ్ ఆటో ప్రచార జాతాను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగబోవు సిఐటియు 18వ మహాసభలలో కార్మిక వర్గాన్ని భాగస్వామ్యం చేసేందుకు ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 2 వరకు ఎయు హైస్కూల్ మైదానంలో నిర్వహించే శ్రామిక ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎయు హైస్కూల్ మైదానంలో శ్రామిక ఉత్సవ్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ నటులు ప్రకాష్‌రాజ్ హాజరవుతారని చెప్పారు. ఈ మహాసభలు మొట్టమొదటిసారిగా ఆంధ్ర రాష్ట్రం విశాఖలో జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా సుమారు 1600 మంది కార్మికులు హాజరవుతున్నారని తెలిపారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఈ సభలో చర్చించి కార్యాచరణ రూపొందించనున్నట్టు చెప్పారు. ముఖ్యంగా కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ ఇన్స్యూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని తదితర అంశాలపై చర్చించబోతున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరేంద్రకుమార్, పి.శంకర్రావు, నాగరాజు, రమణ, కృష్ణవేణి, రాము, చిన్న తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : సిఐటియు 18వ మహాసభను జయప్రదం చేయాలని భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో తగరపువలస బైపాస్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం ఆటో స్టాండ్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. కార్మిక వర్గ పోరాటాల ద్వారా సాధించిన విజయాలను తెలియజేస్తూ ప్రదర్శన సాగింది. ప్రజలు, కార్మికులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ, సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే ర్యాలీని, మున్సిపల్ గ్రౌండ్‌లో చేపట్టే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ పోరాటాల ద్వారా కార్మిక వర్గానికి అండగా నిలవడమే ఈ మహాసభ ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంపాన సూర్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు నేలత రాము, పల్ల పెంటరాజు, పల్లా రమణ, నమ్మి నాయుడు, పల్లా పోతురాజు, దుర్గారావు, రమణ, గుజ్జు నరసింహారావు, శ్రీను, మగడ ఈశ్వరరావు, ముఠా, ఆటో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

కశింకోట : సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. కశింకోట మండలంలోని క్రెబ్స్ కంపెనీ వద్ద గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ నుండి 4 జనవరి వరకు విశాఖపట్నంలో ఈ మహాసభలు జరుగుతున్నాయని, చివరి రోజు జరుగు భారీ ర్యాలీ, బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్షులు ఏవి.అప్పారావు, కార్యదర్శి బాబురావు, నాయకులు ఓ.అప్పారావు, త్రినాథ, జె.శ్రీను, టి.కృష్ణ, మహేష్, రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.



ప్రచార సమావేశంలో పాల్గొన్న క్రెబ్స్ కార్మికులతో శంకరరావు

వంజంగిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండ వద్ద గురువారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఆయా రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు పాడేరుకు ముందుగా చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారంతా పాడేరులోని లాడ్జిల్లో రాత్రి బస చేసి గురువారం వేకువ జామును వంజంగి మేఘాల కొండకు తరలి వచ్చారు. మరి కొందరు పర్యాటకులు నేరుగా వంజంగి ప్రాంతానికి చేరుకుని రిసార్ట్వ్‌లో క్యాంప్ ఫైర్; గిరిజన సాంప్రదాయ థింసా నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. గత వారం రోజులుగా చలి తీవ్రత, మంచు అధికంగా ఉండటంతో పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకిస్తూ పరవశించి పోయారు. మేఘాల కొండపై పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాలు, సూర్యోదయం వేళ మంచును చీల్చుకుని వచ్చి భానుడి కిరణాలు పర్యాటకుల మదిని దోచేస్తున్నాయి.